క్లుప్తంగా

పెదఅమిరంలో శాంతి ర్యాలీ



గ్రామంలో సర్పంచ్, కార్యదర్శికి వినతిపత్రం అందిస్తున్న సంఘు నాయకులు

కాళ్ల: మణిపూర్ రాష్ట్రంలో శాంతిని నెలకొల్పాలని కోరుతూ పెదఅమిరం గ్రామంలో క్రైస్తవ సంఘాల ఆధ్వర్యంలో ఆదివారం శాంతి ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా పాస్టర్లు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించి, ప్రత్యేక గీతాలు ఆలపించారు. మణిపూర్ రాష్ట్రంలో క్రైస్తవులపై జరుగుతున్న దాడులను ఖండిస్తూ, కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. క్రైస్తవుల సంఘాల ఆధ్వర్యంలో జరిగిన శాంతియుత ర్యాలీలో పాస్టర్లు, విశ్వాసులు, గ్రామస్తులు పాల్గొన్నారు. అనంతరం గ్రామంలో సర్పంచ్ డొక్కు సోమేశ్వరరావు, కార్యదర్శి కనకరావులకు వినతిపత్రం అందజేశారు.

అప్రోచ్ నిర్మాణ పనులు ప్రారంభం



జేసీబీతో ముళ్ల పొదలు, కిక్కిసను తొలగిస్తున్న దృశ్యం

భీమవరం అర్బన్: గొల్లవానితిప్పలో యనమదుర్రు డ్రెయిన్‌పై నిర్మించిన బ్రిడ్జి వద్ద గట్టుపై జేసీబీ సహాయంతో ముళ్ల చెట్లు, కిక్కిస తొలగిస్తున్నారు. వంతెనలకు అప్రోచ్‌లు నిర్మాణానికి రూ.36 కోట్లు మంజూరయ్యాయి. ఇటీవల టెక్నికల్ అధికారులు బ్రిడ్జిని పరిశీలించి అప్రోచ్‌ల డిజైన్‌లను తీసుకువెళ్లిన నేపథ్యంలో ఇరిగేషన్ అధికారులు యనమదుర్రు డ్రెయిన్ గట్టుపై ముళ్ల పొదలు, కిక్కిస తొలగించడంతో అప్రోచ్ నిర్మాణ పనుల ప్రక్రియ మొదలైందని గ్రామస్తులు, ప్రయాణికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

కొవ్వాడలో శాంతి ర్యాలీ



కొవ్వాడలో మణిపూర్‌లో శాంతి ర్యాలీ చేస్తున్న క్రైస్తవులు

భీమవరం అర్బన్: మణిపూర్‌లో గిరిజన క్రైస్తవులపై జరుగుతున్న మరణహోమాన్ని కేంద్ర ప్రభుత్వం ఆపి శాంతి నెలకొల్పాలని దళిత ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షుడు గంటా సుందర్ కుమార్ డిమాండ్ చేశారు. మణిపూర్ ఘటనలో దోషులను శిక్షించి శాంతిని నెలకొల్పాలని కోరుతూ కొవ్వాడలో ఆదివారం దళిత క్రైస్తవులు శాంతి ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా గంటా సుందర్ కుమార్ మాట్లాడుతూ మణిపూర్‌లో గిరిజన క్రైస్తవులకు రక్షణ లేదని, వారి ఆస్తులను పథకం ప్రకారం ధ్వంసం చేస్తూ దాడులకు పాల్పడుతున్నారన్నారు. అసాంఘిక శక్తులు రేపిన మరణకాండను అణచివేసి దోషులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. పాలపర్తి జోనా, పుచ్చకాయల జాకోబ్, మానుకొండ, జైహింద్, బట్టు అశోక్, బత్తుల ఆనంద్, ఎస్. ధనరాజ్, ఎ.శ్యామ్ సుందరరావు పాల్గొన్నారు.

ఘనంగా యూత్‌ఫెస్ట్



శాసన మండలి చైర్మన్ మోషేన్‌రాజుకు జ్ఞాపిక అందచేస్తున్న దృశ్యం

భీమవరం(ప్రకాశం చౌక్): భీమవరం రెస్ట్ హౌస్ రోడ్డులోని మన్నా చర్చిలో నిర్వహిస్తున్న యూత్ ఫెస్ట్ కార్యక్రమంలో శాసన మండలి చైర్మన్ కొయ్యే మోషేన్‌రాజు ఆదివారం పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆయన సందేశాన్ని అందించారు. అలాగే బ్లెస్సీ వెస్లీ ముఖ్య వాక్యోపదేశం చేశారు. అనంతరం శాసన మండలి చైర్మన్‌కు నిర్వాహకులు జ్ఞాపిక అందజేశారు. ఈ కార్యక్రమంలో క్రిస్టియన్ మైనార్టీ సెల్ అధ్యక్షుడు మేడిది జాన్సన్ పాల్గొన్నారు.

సూర్యమిత్ర సిబ్బందికి సత్కారం



భీమవరం సూర్యమిత్ర సంస్థ సిబ్బందిని సత్కరిస్తున్న సూర్యారావు తదితరులు

సాక్షి, భీమవరం: సూర్యమిత్ర సంస్థ రజతోత్సవాన్ని ఆదివారం భీమవరంలో ఘనంగా నిర్వహించారు. 1998లో స్థాపించిన ఈ సంస్థ అంచెలంచెలుగా ఎదిగి అమెరికా, చైనా, జపాన్, కొరియా, మెక్సికో, థాయ్‌లాండ్ వంటి అనేక దేశాలకు రొయ్యలను ఎగుమతి చేసే స్థాయికి చేరుకుందని సూర్యమిత్ర ఎగ్జిమ్ ఎండీ యుర్రింకి సూర్యారావు, సీఈవో యుర్రింకి గంగారామ్ తెలిపారు. సంస్థలో పనిచేసిన సిబ్బందిని ఈ సందర్భంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో బ్యాంక్ మేనేజర్లు, ఆక్వా రైతులు పాల్గొన్నారు.

తలుపు తట్టి.. నాడి పరీక్షించి

- పేదల ఇంటి వద్దకే మెరుగైన వైద్యం
- సత్ఫలితాలనిస్తున్న 'ఫ్యామిలీ డాక్టర్'
- 104 వాహనాల్లో 14 రకాల సేవలు
- అందుబాటులో 67 రకాల మందులు



కొమరాదలో వైద్యం అందిస్తున్న పీహెచ్‌సీ వైద్యాధికారిణి సీహెచ్ ధనలక్ష్మి

భీమవరం అర్బన్: పేదలకు మెరుగైన వైద్యం అందించేందుకు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం ఎన్నో చర్యలు తీసుకుంటోంది. ఓ వైపు ప్రభుత్వ ఆస్పత్రుల్లో కార్పొరేట్ వైద్యం ప్రతి ఒక్కరికి చేరువ చేస్తూనే మరో వైపు ఫ్యామిలీ డాక్టర్ కాన్సెప్ట్‌ను అమలు చేసి పేదల ఇంటికే మెరుగైన వైద్యం అందిస్తున్నారు. ఈ విధానంలో పీహెచ్‌సీ వైద్యులు గ్రామాల్లో ఇళ్లకే వెళ్లి వైద్యం అందిస్తుండటంతో ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

నెలలో రెండు సార్లు ఇంటింటికీ..

మండలంలోని తుందుర్రు, గొల్లవానితిప్ప గ్రామాలలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలున్నాయి. వీటి పరిధిలోని 25 గ్రామాలలో ఫ్యామిలీ డాక్టర్ విధానంలో రెండు 104 వాహనాల ద్వారా నెలకు రెండు సార్లు ఇంటింటికి తిరిగి దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులు, జనరల్ రోగులకు వైద్య సేవలు అందిస్తున్నారు. అంతేకాకుండా అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారుల ఆరోగ్యంతో పాటు, మండల పరిషత్ ప్రాథమిక, ప్రాథమికోన్నత, జిల్లా పరిషత్ ఉన్న పాఠశాలల విద్యార్థులకు ఆరోగ్య సూచనలు అందిస్తున్నారు.

ఇళ్ల వద్దే పరీక్షలు

కొత్త వైద్య విధానంలో భాగంగా ఇంటి వద్దకే వెళ్లి పరీక్షలు నిర్వహిస్తున్నారు. 104 వాహనంలో మెడికల్ ల్యాబ్‌లో 14 రకాల పరీక్షలు నిర్వహిస్తున్నారు. బాధితుడి ఆరోగ్య పరిస్థితి ఆధారంగా వైద్యుల సూచనలు మేరకు రక్త పరీక్షలు చేస్తున్నారు. అలాగే ఆరోగ్య సమస్యలను గుర్తించి బాధితులకు అప్పటికప్పుడే మందులు పంపిణీ చేస్తున్నారు. వాహనంలో 67 రకాల మందులు సిద్ధం చేశారు. ఆరోగ్యశ్రీ ద్వారా కార్పొరేట్ వైద్యాన్ని అందిస్తున్న ప్రభుత్వం శస్త్ర చికిత్సల అనంతరం బాధితుడి పర్యవేక్షణపై ప్రత్యేక దృష్టి సారించింది. మండలంలో రెండు పీహెచ్‌సీల పరిధిలోని గ్రామాల్లో వైద్య సేవలను అందించారు. వీటిలో హైపర్ టెన్షన్ కేసులు 25,092, డయాబెటీస్ 12,837, హైపర్ టెన్షన్, డయాబీటిక్ 21,379, గర్భిణులు 6,801, బాలింతలు 4,378, క్యాన్సర్ 148, ఆరోగ్య డిశ్చార్జ్‌డ్ కేసులు 654 ఉన్నాయి.

ఆరోగ్య శ్రీలో 3,600కు పైగా వైద్య సేవలు

ఆరోగ్య శ్రీలో సుమారు 3వేల 600 పైగా వైద్య సేవలను పరిధిలోకి తీసుకురావడం, పొరుగు రాష్ట్రాల్లోనూ వైద్య సేవలు పొందే అవకాశాన్ని రాష్ట్ర ప్రభుత్వం కల్పించింది. నాడు–నేడు ద్వారా ప్రభుత్వాసుపత్రుల్లో అత్యాధునిక సదుపాయాలు కల్పనకు చర్యలు తీసుకుంటోంది.

ఇంటికి వచ్చి వైద్యం చేస్తున్నారు



వృద్ధాప్యం వల్ల కొడుకు లేదా మనవడి ఆసరాతో ఆస్పత్రికి వెళ్లేదానిని. వారు అందుబాటులో లేకపోతే అంతే సంగతులు. ఫ్యామిలీ డాక్టర్ కాన్సెప్ట్ ద్వారా డాక్టర్లు ఇంటికే వచ్చి బీపీ, సుగర్ పరీక్షలు చేసి మందులు ఉచితంగా ఇస్తున్నారు. ఎక్కడికి వెళ్లకుండా ఇంటి దగ్గరే వైద్య సదుపాయాలు అందజేస్తున్నారు.

– సంధి విజయమణి,
బ్రెస్ట్ క్యాన్సర్ రోగి, చినఅమిరం

పకడ్బందీగా అమలు



నెలలో రెండు సార్లు గ్రామాలకు వెళ్లి ఇంటింటికి తిరిగి రోగులను గుర్తించి 104 వాహనాలలోని ల్యాబ్‌లలో 14 రకాల వైద్య పరీక్షలు చేసి 67 రకాల మందులను ఉచితంగా ఇస్తున్నాం. అలాగే అంగన్‌వాడీ, స్కూల్ విద్యార్థులకు ఆరోగ్య పరీక్షలు చేసి ఫ్యామిలీ డాక్టర్ విధానాన్ని పకడ్బందీగా అమలు చేస్తున్నాం.

– సీహెచ్ ధనలక్ష్మి,
పీహెచ్‌సీ వైద్యాధికారిని, గొల్లవానితిప్ప

పచ్చని చెట్లు ప్రగతికి మెట్లు

వీరవాసరం: పర్యావరణ పరిరక్షణ ప్రజలందరి బాధ్యత అని రిటైర్డ్ ఐఆర్‌టీఎస్ (రైల్వే) జనరల్ మేనేజర్ కాయల వెంకటరావు అన్నారు. నేలపోగుల గ్రామంలో ప్రగతి భారత్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఆదివారం మొక్కలు నాటే కార్యక్రమాన్ని నిర్వహించారు. పచ్చని చెట్లు ప్రగతికి మెట్లు అని నినదించారు. ప్రజలకు ఉపయోగపడే విధంగా మొక్కలు నాటే కార్యక్రమాన్ని ప్రతి ఒక్కరు చేపట్టాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ట్రస్ట్ వైస్ చైర్‌పర్సన్ కాయల సునీత, గ్రామ పంచాయతీ వార్డు సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

రక్తదాన శిబిరం

భీమవరం (ప్రకాశంచౌక్): ఆర్ఆర్ అండ్ – ఫ్రెండ్స్ సేవా సమితి ఆధ్వర్యంలో తలసేమియా బాధిత చిన్నారుల కోసం ఆనంద బ్లడ్ బ్యాంక్ ఆధ్వర్యంలో పట్టణంలో ఆదివారం స్వచ్ఛంద రక్తదాన శిబిరం నిర్వహించారు. శిబిరంలో 15 మంది దాతలు రక్తదానం చేశారు. ఈ సందర్భంగా వన్‌టౌన్ సీఐ అడబాల శ్రీను మాట్లాడుతూ తలసేమియా బాధిత చిన్నారుల కోసం రక్తదాన శిబిరం ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. నిర్వాహకులను అభినందించారు. సంస్థ గౌరవ అధ్యక్షుడు ఆనంద రఘువర్మ రక్తదనం చేసినవారికి ప్రశంసాపత్రాలు అందించారు. కార్యక్రమంలో తాళ్లపూడి పరమేశ్వరరావు, గెద్దా రామారావు, కొడమంచలి సిద్దయ్య, ఋురిడి సత్య వరప్రసాదు, తోటశ్రీనివాసు, మామిడిపల్లి వినయ్‌కుమార్, కారుమూరి సతీష్, కోరాడ అప్పల నాయుడు, పొన్నాడ రామారావు పాల్గొన్నారు.

నేడు వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తల సమావేశం

ఉండి: స్థానిక రాజుల కల్యాణ మండపంలో సోమవారం ఉదయం 9:30 గంటలకు మండల వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులకు ప్రత్యేక సమావేశాన్ని నిర్వహిస్తున్నట్లు మండల పార్టీ అధ్యక్షుడు పీవీఆర్‌కే ఆంజనేయరాజు తెలిపారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా నియోజకవర్గ పరిశీలకురాలు పిల్లంగోళ్ల శ్రీలక్ష్మీ హాజరవుతున్నట్లు తెలిపారు. పార్టీ శ్రేణులు అధిక సంఖ్యలో సమావేశానికి హాజరుకావాలని కోరారు.

పేకాడుతున్న ఇద్దరి అరెస్ట్

పాలకొల్లు అర్బన్: మండలంలోని కాపవరంలో ఆదివారం పేకాట శిబిరంపై పోలీసులు దాడి చేశారు. ఈ దాడిలో పేకాడుతున్న ఇద్దరు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నట్లు రూరల్ ఎస్సై ఎస్ శ్రీనివాస్ తెలిపారు. వీరి వద్ద నుంచి రూ.1050 నగదు స్వాధీనం చేసుకున్నామని వివరించారు.

యూత్ హాస్టల్స్ నూతన కార్యవర్గం ఎన్నిక

సాక్షి, భీమవరం: యూత్ హాస్టల్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా నూతన కార్యవర్గాన్ని పట్టణంలోని శ్రీకృష్ణదేవరాయ కల్యాణ మండపంలో ఆదివారం నిర్వహించిన సమావేశంలో ఎన్నుకున్నారు. రాష్ట్ర అధ్యక్షుడిగా డాక్టర్ వీవీజీ సోమరాజు, చైర్మన్‌గా సీహెచ్ రవిపాల్, వైస్ ప్రెసిడెంట్‌లుగా డాక్టర్ కే కొండయ్య, అబ్దుల్ ఖలీల్, ఆర్‌వీవీ ఎస్.జగపతిరాజు, కోశాధికారిగా ఈ.శ్రీనివాస్, ఆర్గనైజింగ్ సెక్రటరీగా డాక్టర్ కేవీఎస్‌పీఎస్ వర్మ, కార్యదర్శిగా ఎండీ ఇబ్రహీం, ఎపీసీ చైర్మన్‌గా సత్యానందం ఎన్నికైయ్యారు. అనంతరం నూతన కార్యవర్గాన్ని ఘనంగా సత్కరించారు. ఇచ్చిన బాధ్యతలు సక్రమంగా నిర్వర్తించి అసోసియేషన్ అభివృద్ధికి కృషి చేస్తామని అన్నారు. కార్యక్రమంలో యూత్ హాస్టల్స్ సభ్యులు నందమూరి రాజేష్, మట్లపూడి సత్యనారాయణ, జానపటి మధుసూదన్, వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

మహిళలకు కుట్టు మెషీన్ల పంపిణీ



మహిళలకు కుట్టుమెషీన్లు పంపిణీ చేస్తున్న డీసీసీబీ చైర్మన్ పీవీఎల్ నర్సింహరాజు

ఆకివీడు: మహిళలు ఆర్థికంగా, రాజకీయంగా ఎదగాలని డీసీసీబీ చైర్మన్ పీవీఎల్ నర్సింహరాజు పిలుపునిచ్చారు. స్థానిక నగర పంచాయతీ పరిధిలోని సంతపేట వద్ద ఉన్న బసవతారకం మెమోరియల్ కుట్టు శిక్షణా కేంద్రంలో ఆదివారం శిక్షణ పూర్తి చేసిన మహిళలకు కుట్టు మెషీన్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బసవతారకం కేంద్రం గత మూడు దశాబ్దాలుగా వేలాది మంది మహిళలకు శిక్షణ ఇచ్చి ప్రభుత్వాల ద్వారా ఉచితంగా మెషీన్లు అందజేయడం అభినందనీయమన్నారు. మహిళలు కుట్టు పనిలో నైపుణ్యం సాధించి, ఆధునిక పద్ధతులతో ముందుకు వెళ్లాలన్నారు. రెడీమేడ్ దుస్తులకు దీటుగా కుట్టు పని ఉండడం ద్వారా అధికంగా దుస్తులు కుట్టించుకునేందుకు వస్తారని చెప్పారు. ప్రభుత్వం డ్వాక్రా పథకంలో మహిళలకు మరింత చేయూతనిస్తుందని పీవీఎల్ నర్సింహరాజు అన్నారు. మహిళా సాధికారిత కోసం సీఎం జగన్ మోహన్‌రెడ్డి ఎన్నో పథకాల్ని అమలుజేస్తున్నారని చెప్పారు. మహిళలకు అందజేస్తున్న ఆర్థిక చేయూత ద్వారా వివిధ కుటీర పరిశ్రమల్ని స్థాపించి, ఆర్థిక స్థితిని మెరుగు పరచుకోవాలన్నారు. కుట్టుమెషీన్ల 12 కొనుగోలుకు ఒకొక్క మెషీన్‌కు రూ. 3,500 చొప్పున ఆర్థిక సహాయాన్ని వైస్‌చైర్మన్ పుప్పాల పండు, పుప్పాల గంగాధర్(చిన్నా) అందజేశారు. కార్యక్రమంలో నగర పంచాయతీ చైర్‌పర్సన్ జామి హైమావతి, జెడ్పీటీసీ సభ్యుడు వేగేశ్న వెంకట్రాజు(యండగండి శ్రీను), మెప్మా అధ్యక్షురాలు మోరా జ్యోతి రెడ్డి, త్రిసభ్యకమిటీ చైర్మన్ కేశిరెడ్డి మురళీ, చీఫ్‌విప్ పడాల శ్రీనివాసరెడ్డి, కౌన్సిలర్లు నిమ్మల నాగు, కట్టా రవి, తిమ్మారెడ్డి మాధవి, గేదల అప్పారావు, ఎండీ జక్కీ, గుండుగొలను సావిత్రి, జీ.ధనరాజు, శిరపు శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ధ్యానంతో ఆరోగ్యం



ధ్యాన శిక్షణలో పాల్గొన్న దృశ్యం

వీరవాసరం: వీరవాసరంలోని శ్రీసీతారామస్వామి వారి దేవస్థానం ప్రాంగణంలో మండల పిరమిడ్ స్పిరిచ్యువల్ సొసైటీ ఆధ్వర్యంలో ఉచిత ధ్యాన శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో తాడేపల్లిగూడెంకు చెందిన సీనియర్ పిరమిడ్ మాస్టర్ రేణు విశ్వరేఖ పాల్గొని జ్ఞానబోధ చేశారు. రేణు విశ్వరేఖ మాట్లాడుతూ ప్రతిరోజు శ్వాసపై ధ్యాస ఉంచి ధ్యానం చేయడం ద్వారా అధిక విశ్వమయ ప్రాణశక్తిని పొంది ఆరోగ్య, ఆనందమయ జీవనాన్ని గడపవచ్చని, ఆత్మజ్ఞానం పొందవచ్చన్నారు. ప్రతిరోజూ ఆలోచనలు, మాటలు, చేష్టలు గమనిస్తూ మెరుగుపరుచుకోవాలన్నారు. ధ్యాన సాధనతో పాటు స్వాధ్యాయం, సజ్జన సాంగత్యం, సేవా కార్యక్రమాలు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కో–ఆర్డినేటర్ కేవీడీ ప్రసాద్, సన్నిధి ఉదయ్, యడ్ల నాగమణి, సబ్బారపు కమల, బోళం యర్రాయమ్మ, జామి పైడమ్మ, బుడబళ్ల శ్రీదేవి ధ్యానం చేశారు.

పూర్వ విద్యార్థుల కృషి అభినందనీయం



కోపల్లె హైస్కూల్లో మొక్క నాటుతున్న దృశ్యం

కాళ్ల: తాము చదువుకున్న పాఠశాల అభివృద్ధికి పూర్వ విద్యార్థులు ముందుకు రావడం అభినందనీయమని జిల్లా విద్యాశాఖ అధికారి ఆర్.వెంకటరమణ అన్నారు. కోపల్లె జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పూర్వ విద్యార్థులు ఆధ్వర్యంలో ఆదివారం ఏర్పాటు చేసిన వనమహోత్సవ కార్యక్రమానికి డీఈఓ ముఖ్యఅతిథిగా విచ్చేశారు. దీనిలో భాగంగా పూర్వ విద్యార్థి, ఐఐటీ ఢిల్లీ మాజీ డైరెక్టర్ వీఎస్ రాజు ప్రోత్సాహంతో ఏర్పాటు చేసిన సుమారు 1000 మొక్కలను పాఠశాల ఆవరణలో ప్రజా ప్రతినిధులు, ఉపాధ్యాయులు, పూర్వవిద్యార్థులు నాటారు. అనంతరం పాఠశాలలో ఏర్పాటుచేసిన ప్రత్యేక సమావేశంలో డీఈఓ వెంకటరమణ మాట్లాడుతూ పాఠశాల అభివృద్ధి కోసం పూర్వ విద్యార్థులంతా ఒక కమిటీగా ఏర్పడి సుమారు రెండు కోట్ల నిధిని సేకరించి పనులు చేపట్టటం శుభపరిణామమన్నారు. తొలుత పాఠశాల ఆవరణ అంతా పచ్చదనంతో సుందరీకరణ చేయటానికి మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టడం సంతోషదాయకమన్నారు. శిథిలావస్థకు చేరిన పాఠశాల భవనాన్ని సైతం పునర్నిర్మాణం కోసం అవసరమైతే నిధులు అందిస్తామని చెప్పటం అభినందనీయమన్నారు. దీనిని ఆదర్శంగా తీసుకుని మిగిలిన పాఠశాలల్లో కూడా వాటి అభివృద్ధికి పూర్వ విద్యార్థులు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. జిల్లా విద్యాశాఖ తరపున ఎటువంటి సహాయ సహకారాలు కావాలన్నా సహకరిస్తామన్నారు. ఐఐటీ ఢిల్లీ మాజీ డైరెక్టర్ వీఎస్ రాజు మాట్లాడుతూ చదువుకు మించిన జ్ఞానం లేదన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ పెన్మెత్స శిరీష విశ్వనాథరాజు, జెడ్పీటీసీ సభ్యుడు పచ్చిగోళ్ల సోమేశ్వరరావు, ఉపసర్పంచ్ బూడి వెంకటపరాలు, ఎంఈఓ కనకరాజు, మంతెన రామకుమార్ రాజు, డాక్టర్ రామకృష్ణంరాజు, డాక్టర్ గోపాలరాజు, ప్రధానోపాధ్యాయుడు సుబ్బరాజు, పూర్వ విద్యార్థులు కొత్తపల్లి బంగార్రాజు, అభిరుచి కాశీ, పుల్లంరాజు, సిహెచ్ వెంకట్రావు, మురళీకృష్ణంరాజు తదితరులు పాల్గొన్నారు.

పోలీసు క్యాంటీన్ ప్రారంభం



భీమవరంలో పోలీసు క్యాంటీన్‌ను ప్రారంభిస్తున్న ఎస్పీ సతీమణి కోమలి, చిత్రంలో ఎస్పీ రవిప్రకాష్

సాక్షి, భీమవరం: పట్టణంలోని డీఎస్పీ కార్యాలయం సమీపంలోని క్వార్టర్స్ వద్ద పోలీసుల కోసం ప్రత్యేకంగా సబ్సిడీ క్యాంటీన్‌ను ఆదివారం జిల్లా ఎస్పీ యు.రవిప్రకాష్ సతీమణి కోమలి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎస్పీ రవిప్రకాష్ మాట్లాడుతూ పోలీసు కుటుంబాల కోసం తక్కువ ధరలో నిత్యావసర వస్తువులు అందించే లక్ష్యంతో క్యాంటీన్ ప్రారంభించామన్నారు. ఇక్కడ పోలీస్ డిపార్ట్‌మెంట్‌ను హోంగార్డు నుంచి పైస్థాయి అధికారుల వరకు సద్వినియోగం చేసుకోవాలన్నారు. అనంతరం నా భూమి – నాదేశం కార్యక్రమంలో భాగంగా డీఎస్పీ కార్యాలయం ఆవరణలో ఎస్పీ రవిప్రకాష్, కోమలి దంపతులు మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో అడిషినల్ ఎస్పీలు (అడ్మిన్) ఏవీ సుబ్బరాజు, ఏటీవీ రవికుమార్ (సెబ్), డీఎస్పీ బండారు శ్రీనాథ్, ఏఆర్ డీఎస్పీ ఎం.సత్యనారాయణ, భీమవరం వన్ టౌన్, టుటౌన్, రూరల్ సీఐలు అడబాల శ్రీను, జి.శ్రీనివాస్, నాగప్రసాద్, రిజర్వ్ సీఐ శ్రీకాంత్, వెంకట్రావు పాల్గొన్నారు.

'బైట్' కళాశాలకు నాక్–ఎ గుర్తింపు



బైట్ కళాశాలలో విలేకర్లతో మాట్లాడుతున్న చైర్మన్ శ్రీవెంకటేశ్వరరావు

సాక్షి, భీమవరం: భీమవరం ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ (బైట్) కళాశాలకు నాక్–ఎ గ్రేడ్ గుర్తింపు లభించిందని కళాశాల చైర్మన్ ఎ.శ్రీవెంకటేశ్వరరావు చెప్పారు. కళాశాలలో ఆదివారం విలేకరులతో మాట్లాడుతూ గత నెల 26, 27 తేదీల్లో నాక్ టీమ్ కళాశాలను సందర్శించి విద్య ప్రమాణాలు, ల్యాబ్ వంటి సౌకర్యాలను పరిశీలించి సంతృప్తి చెందడంతో నాక్–ఎ గ్రేడ్ గుర్తింపు లభించిందన్నారు. 2007లో స్థాపించిన బైట్ కళాశాల ఏఐసీటీఈ, జెఎన్‌టీయూకే గైడెన్స్ ప్రకారం ఉన్నత ప్రమాణాలతో విద్యాబోధన చేస్తూ ఉత్తమ ఫలితాలను సాధిస్తున్నామన్నారు. ఏటా 80 శాతం మంది విద్యార్థులకు ఎంఎన్‌సీ కంపెనీల్లో ఉద్యోగాలు పొందేలా క్యాంపస్ ప్లేస్‌మెంట్స్‌కు తగిన శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. వైస్ చైర్మన్ టీవీవీ ప్రసాద్, ప్రిన్సిపాల్ డాక్టర్ కె.సురేష్ మాట్లాడుతూ నాక్–ఎ గ్రేడ్‌కు ఐదేళ్ల కాలపరిమితి ఉంటుందన్నారు. చెరుకువాడ రంగసాయి తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన ఈశా గ్రామోత్సవాలు

పాలకోడేరు: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో ఈశా ఫౌండేషన్ ఆధ్వర్యంలో రెండు రోజుల పాటు జరిగిన గ్రామోత్సవాలు ఆదివారంతో ముగిశాయి. వాలీబాల్ పురుషుల విభాగంలో ఆరవల్లి, కోపల్లె మధ్య జరిగిన ఫైనల్ పోరు హోరాహోరీగా సాగింది. 2–0 తేడాతో ఆరవల్లి జట్టు విజేతగా నిలబడగా, కోపల్లె రన్నర్‌గా నిలిచింది. మహిళల త్రోబాల్ పోటీల్లో విజేతగా బొండాడ, రన్నర్‌గా గొల్లవానితిప్ప జట్లు నిలిశాయి. పోటీల అనంతరం విజేతలకు నగదు పురస్కారంతో పాటు ట్రోఫీలను అందజేశారు. కార్యక్రమంలో డాక్టర్ ఆర్‌వీ రమణ, సర్పంచి ఇంజేటి మరియమ్మ, ఈశా సమన్వయకర్త డాక్టర్ విజయ, పీడీ రాము తదితరులు పాల్గొన్నారు.

మాజీ సర్పంచ్‌కు పీవీఎల్ పరామర్శ



సూర్యనారాయణరాజును పరామర్శిస్తున్న పీవీఎల్

ఆకివీడు: ఇటీవల రోడ్డు ప్రమాదంలో తీవ్ర గాయమై శస్త్రచికిత్స చేయించుకున్న వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు మాజీ సర్పంచ్, దుంపగడప గ్రామ వార్డు సభ్యుడు పిన్నమరాజు సూర్యనారాయణరాజును డీసీసీబీ చైర్మన్ పీవీఎల్ నర్సింహరాజు పరామర్శించారు. ఆదివారం ఆయన నివాసానికి వెళ్లి సూర్యనారాయణరాజు ఆరోగ్య పరిస్థితిని, శస్త్రచికిత్స విధానాన్ని తెలుసుకున్నారు. ఆయన త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో గ్రామ వైఎస్సార్ సీపీ నాయకులు కొట్టు ఆంజనేయులు, కోయ అయ్యన్న, కుర్రెళ్ల పొలు, కవిటం సుబ్రహ్మణ్యం, మద్దా సురేష్, జెడ్పీటీసీ సభ్యులు వేగేశ్న వెంకట్రాజు, త్రిసభ్య కమిటీ చైర్మన్ కేశిరెడ్డి మురళీ, మెప్మా అధ్యక్షురాలు మోరా జ్యోతిరెడ్డి, పలువురు నాయకులు పరామర్శించిన వారిలో ఉన్నారు.

మార్ఫింగ్ ఫొటోలతో దుష్ప్రచారం

పాలకొల్లు అర్బన్: సీఎం జగన్ అమలాపురం పర్యటనలో మంత్రి విశ్వరూప్‌ని అవమానించారంటూ పచ్చ మీడియా దుష్ప్రచారం చేస్తోందని రాష్ట్ర ఎస్సీ కమిషన్ మెంబర్ చెల్లెం ఆనందప్రకాష్ వెల్లడించారు. దళితులను అవమానించే గుణం సీఎం జగన్ రక్తంలో లేదని ఆయన అన్నారు. పాలకొల్లు ఏఎంసీ అతిథి గృహంలో ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. మంత్రి విశ్వరూప్ ఫొటోను మార్ఫింగ్ చేసి పచ్చ మీడియాలో ప్రచురించారన్నారు. మంత్రి విశ్వరూప్‌కి అమలాపురం పర్యటనలో గౌరవం ఇవ్వలేదని ప్రచారాన్ని తాను పూర్తిగా ఖండిస్తున్నాన్నారు. సీఎం జగన్ పాలనలో దళితులంతా క్షేమంగా, సంతోషంగా ఉన్నారన్నారు. దళితులను అవమానించే తత్వం చంద్రబాబు, పవన్ కల్యాణ్‌దేనన్నారు. ప్రతి ఒక్కరినీ అన్నా సంబోధించే గుణం సీఎం జగన్‌దని వివరించారు. తనను సైతం ఎంతో మర్యాదగా పిలుస్తారని చెప్పారు. సీఎం జగన్ పాలనలో గత నాలుగేళ్లలో దళితుల సంక్షేమానికి రూ.60 వేల కోట్లు ఖర్చుచేశారని వివరించారు. టీడీపీ ప్రభుత్వ హయాంలో కేవలం రూ.12 వేల కోట్లు మాత్రమే ఖర్చు చేశారని ఆనంద ప్రకాష్ గుర్తు చేశారు. దళితుల్లో ఎవరైనా పుట్టాలని కోరుకుంటారా? అని మాజీ సీఎం చంద్రబాబు వ్యాఖ్యానించి ఘోరంగా అవమానించిన సంఘటన దళితులెవరూ మరచిపోరని గుర్తు చేశారు. విలేకరుల సమావేశంలో కుంచిలపల్లి వినిస్టన్‌బాబు, ఎం.మైఖేల్ రాజు, పార్శి వెంకటరత్నం, పార్టీ నాయకులు దేవ రాజేష్‌కుమార్, మరపట్ల ప్రవీణ్, నేతల నారాయణ మూర్తి తదితరులు పాల్గొన్నారు.

అంబేడ్కర్ ఆశయాలసాధన కోసం కృషి చేయాలి



దాట్ల రామరాజును సత్కరిస్తున్న డీఈఓ వెంకటరమణ

కాళ్ల: అంబేడ్కర్ ఆశయాల సాధన కోసం ప్రతి ఒక్కరు కృషి చేయాలని జిల్లా విద్యాశాఖ అధికారి ఆర్.వెంకటరమణ పేర్కొన్నారు. సీసలి గ్రీన్ వ్యూ ఇంటరనేషనల్ ఫంక్షన్ హాల్లో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ బాహుజన సమాఖ్య సంఘం 2వ వార్షికోత్సవాన్ని ఆదివారం నిర్వహించారు. ఫౌండర్ సోడదాసి గంగయ్య అధ్యక్షతన జరిగిన సమావేశంలో పలువురు మాట్లాడారు. దళితులు, మహిళలు, కార్మికుల హక్కుల కోసం అలుపెరుగని పోరాటం చేసిన యోధుడు అంబేడ్కర్ అయన అడుగుజాడల్లో నడుస్తామన్నారు. ఆయన ఆశయాన్ని కొనసాగించేందుకు ఈసమైక్యకృషి చేస్తుందన్నారు. ఈ సందర్భంగా ఉండి, ఆకివీడు, పాలకోడేరు ,కాళ్ల మండలాల్లో పదోతరగతి ఉత్తీర్ణతలో మండలం ఫస్ట్ సాధించిన విద్యార్థులకు నగదు ప్రోత్సాహక బహుమతులను ఒక్కొక్కరికీ రూ.5 వేల నగదును డీఈఓ చేతులమీదుగా అందజేసి సత్కరించారు. కాళ్లకూరు గ్రామానికి చెందిన దాట్ల శ్రీదేవి మెమోరియల్ ట్రస్ట్ వ్యవస్థాపకులు డాక్టర్ దాట్ల వెంకటరామరాజుకు రాజా రామ్మోహన్ రాయ్ సేవారత్న అవార్డును అందించి సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఆకివీడు సీఐ సత్యనారాయణ, ఎస్సై ఏజీఎస్ మూర్తి, మంచాల ఐజక్, సీపీఎం మండల కార్యదర్శి గొర్ల రామకృష్ణ, ఎ.వీరయ్య, సోడదాసీ జయపాల్, మహమ్మద్ సిద్దిక్, సంఘ సభ్యులు గాతలసందీప్, కొండా రాజేష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

